రక్తదానం చేస్తున్న శ్రీనివాసులు

ఒక్కచోట చేరి.. రక్తదానం చేసి

ఘనంగా శ్రీనివాస మిత్రుల మొదటి వార్షికోత్సవ వేడుకలు

విద్యానగర్, అక్టోబర్ 27 : కరీంనగర్ జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో శ్రీనివాస మిత్రుల మొదటి వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా పీటీసీ ఎస్పీ సుంకరి శ్రీనివాస్, వాట్సాప్ గ్రూప్ జిల్లా అడ్మిన్ ఉట్కూరి శ్రీనివాస్‌రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. వేడుకలకు ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా, హైదరాబాద్, సిద్దిపేట, ఆదిలాబాద్, వరంగల్, తదితర జిల్లాల నుంచి 700 మందికి పైగా శ్రీనివాసులు తరలివచ్చారు. ఈ సందర్భంగా 86 మంది శ్రీనివాసులు తలసేమియా బాధితులకు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారి నుంచి లక్కీ డ్రా ద్వారా నలుగురిని ఎంపిక చేసి టీటీడీలో బ్రేక్ దర్శనానికి తీసుకువెళ్లనున్నట్లు శ్రీనివాస సేవా సమితి బాధ్యులు తెలిపారు. కవి, గాయకులు, పాఠ్యపుస్తకాల రచయిత నంది శ్రీనివాస్ రూపొందించిన శ్రీనివాస నామ గీతాలను ఆవిష్కరించారు. ఈ గీతాలకు గానం, సంగీతం పూర్తిగా సొంత టెక్నాలజీని ఉపయోగించిన నంది శ్రీనివాస్‌ను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా నంది శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంత మంది శ్రీనివాసుల సమక్షంలో ఈ పాటలను ప్రాచుర్యంలోకి తెచ్చినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు.

గర్శకుర్తిలో పవర్‌లూమ్స్‌ను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

కార్మికులను ఆగం చేస్తున్న సర్కారు

మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర, అక్టోబర్ 27: బీఆర్ఎస్ పాలనలో ఉపాధి పొందుతూ సంతోషంగా జీవించిన చేనేత కార్మికులను కాంగ్రెస్ సర్కారు ఆగం చేస్తున్నదని, పవర్‌లూమ్స్‌ను ఆదుకుని ఉపాధి కల్పించాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. మండలంలోని గర్శకుర్తి పవర్‌లూమ్స్‌ను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బతుకమ్మ చీరల తయారీకి ఆర్డర్ ఇవ్వకపోవడంతో కార్మికులు ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. విజిలెన్స్ అధికారులు పెట్టిన కేసులను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సేవ చేసేందుకు పోటీ చేస్తున్నా

- నేడు అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి రాజీనామా
- ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ

కరీంనగర్ కార్పొరేషన్, అక్టోబర్ 27 : నిస్వార్థంగా పట్టభద్రులకు సేవ చేయాలన్న ఆలోచనతో రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాను పోటీకి సిద్ధమవుతున్నానని ప్రసన్న హరికృష్ణ తెలిపారు. ఆదివారం స్థానిక కరీంనగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తనకు ఇంకా 19 ఏళ్ల అసిస్టెంట్ ప్రొఫెసర్ సర్వీసు ఉందని, కానీ.. ప్రజలకు మంచి చేయాలన్న ఆలోచనతోనే సర్వీసును కూడా వదులుకునేందుకు సిద్ధపడ్డానని తెలిపారు. ఇప్పటికే ఉమ్మడి నాలుగు జిల్లాల్లో మొదటి దఫా పర్యటన పూర్తి చేసుకున్నానని, ఎంతోమంది విద్యావేత్తలు, మేధావులు, పట్టభద్రులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, వివిధ సంఘాల నేతలను కలిశానని చెప్పారు. ఇకనుంచి పూర్తిస్థాయిలో ప్రచారాన్ని ముమ్మరం చేయడానికి సోమవారం (ఈ నెల 28న) ఉదయం గజ్వేల్ మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కి తన ఉద్యోగ రాజీనామా లేఖను సమర్పిస్తున్నట్టు తెలిపారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడి, ఉదయం 11 గంటలకు సిద్దిపేట దగ్గరలోని రేణిగుంట టోల్గేట్ వద్దకు చేరుకొని అక్కడి నుంచి వాహన ర్యాలీగా మధ్యాహ్నం 12.30 గంటలకు కరీంనగర్‌లోని పద్మనాయక కల్యాణ మండపానికి చేరుకుంటానని వివరించారు. అనంతరం వివిధ సంఘాల నేతలు, పట్టభద్రులు, విద్యావేత్తలతో ఆత్మీయ సమ్మేళనం ఉంటుందని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ

రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో సత్తా చాటాలి

జూడో పోటీలను ప్రారంభిస్తున్న సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనంతరెడ్డి

కొత్తపల్లి, అక్టోబర్ 27 : రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు సత్తా చాటి చాంపియన్‌గా నిలవాలని రాష్ట్ర జూడో సంఘం ఉపాధ్యక్షుడు, మానేరు విద్యా సంస్థల అధినేత కడారి అనంతరెడ్డి ఆకాంక్షించారు. జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో కరీంనగర్ మంకమ్మతోటలోని సాయి మానేరు పాఠశాలలో ఆదివారం జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-17 బాలబాలికల జూడో ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆత్మస్థైర్యానికి, ఆత్మవిశ్వాసానికి జూడో ఎంతగానో దోహదపడుతుందన్నారు. జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి వేణుగోపాల్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా స్థాయి జూడో ఎంపిక పోటీలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 150 మందికి పైగా బాల బాలికలు హాజరైనట్లు పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో రాణించిన క్రీడాకారులను ఈ నెల 28 నుంచి వరంగల్ జిల్లాలో జరిగే 68వ పాఠశాలల రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సరితారెడ్డి, పీడీలు, పీఈటీలు రమణ, విద్యాసాగర్, శ్రీధర్, శ్రీనివాస్, సుధాకర్, నరేందర్, కోచ్ లు సాయిరాం యాదవ్ పాల్గొన్నారు.

నూతన బాధ్యులను అభినందిస్తున్న తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరి శంకర్

మున్నూరు కాపులు ఐక్యంగా ఉండాలి

రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరి శంకర్

విద్యానగర్, అక్టోబర్ 27: మున్నూరు కాపులు ఐక్యంగా ఉండి ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఐక్యంగా ముందుకు సాగాలని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరిశంకర్ కోరారు. ఆదివారం మంకమ్మతోటలో మున్నూరు కాపు సంఘం ఎన్నికలు నిర్వహించారు. దీనికి హరిశంకర్ హాజరై మాట్లాడుతూ, సంఘ నిర్మాణంలో మున్నూరు కాపులు ముందుకు రావాలని, అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. అనంతరం సంఘం అధ్యక్షుడిగా ముప్పిడి సునీల్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా కొట్టె శేఖర్, కోశాధికారిగా ఎన్నం దేవేందర్‌ను ఎన్నుకున్నారు. గెలిచిన సంఘం సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దిండిగాల మహేశ్, కులపెద్దలు పాల్గొన్నారు.

శరవేగంగా కళాభారతి అభివృద్ధి పనులు

కార్పొరేషన్, అక్టోబర్ 27: కరీంనగర్ నగరపాలక సంస్థ ఆవరణలో ఉన్న కళాభారతిలో మరమ్మతు పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇటీవల కళాభారతిని సందర్శించిన కలెక్టర్ పమేలా సత్పతి, వెంటనే దీనిని వినియోగంలోకి తీసుకురావాలని నగరపాలక అధికారులను ఆదేశించారు. దీంతో రూ.15 లక్షల వ్యయంతో కళాభారతిలో అవసరమైన మరమ్మతు పనులు చేపట్టారు. వచ్చే నెల 14లోగా వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. స్టేజీ పనులతో పాటు, భవనంపై స్లాబ్, కుర్చీల మరమ్మతులు చేపట్టారు. వీటితో పాటు ముందు వరుసలో వీఐపీ సోపాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే ఈ ప్రాంతంలో ఉన్న చెత్త సామగ్రిని పూర్తిగా ఇతర ప్రాంతాలకు తరలించారు. ఈ క్రమంలో ఏళ్ల తరబడిగా మూతపడి ఉన్న కళాభారతికి మళ్లీ మంచి రోజులు వచ్చినట్లేనని పలువురు అభిప్రాయపడుతున్నారు.

నేపాల్‌లో జిల్లావాసి మృతి

నరసింగరావు

రాంనగర్, అక్టోబర్ 27: నగరంలోని మంకమ్మతోట ప్రాంతానికి చెందిన పర్వతనేని నరసింగరావు (60) నేపాల్‌లోని జనక్‌పూరిలో గుండెపోటుతో మృతి చెందాడు. శనివారం ముక్తినాథ్ దర్శనం కోసం వెళ్లిన ఆయనకు ఆక్సిజన్ లెవెల్ తక్కువ ఉండడంతో జనక్ పూరి దవాఖానలో చేర్చారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించే ఏర్పాట్లు చేస్తున్న తరుణంలో ఆదివారం ఉదయం 10:30 గంటలకు గుండెపోటుతో దవాఖానలో మృతి చెందినట్లు ఆయనతో ప్రయాణంలో ఉన్న రవికుమార్ తెలిపారు.

హుజూరాబాద్ నుంచి అరుణాచలానికి బస్సు

హుజూరాబాద్ టౌన్, అక్టోబర్ 27 : గురు పౌర్ణమి సందర్భంగా తమిళనాడులోని అరుణాచలంలో గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల కోసం హుజూరాబాద్ డిపో నుంచి ప్రత్యేక సూపర్ లక్సరీ బస్సు ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ వీ రవీంద్రనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 13న మధ్యాహ్నం 2 గంటలకు హుజురాబాద్ నుంచి బయలుదేరి హైదరాబాద్ మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని కాణిపాకం చేరుకుంటుందని తెలిపారు. అక్కడి వరసిద్ధి వినాయకుడి దర్శనం, తర్వాత వెల్లూరులోని గోల్డెన్ టెంపుల్, నవంబర్ 14న రాత్రి అరుణాచలం చేరుకుంటుందని పేర్కొన్నారు. అరుణాచలేశ్వర గిరి ప్రదక్షిణ పూర్తైన తర్వాత తిరుగు ప్రయాణం 15న సాయంత్రం ప్రారంభమై, 16వ తేదీ ఉదయం అలంపూర్ జోగులాంబ అమ్మవారి శక్తిపీఠాన్ని దర్శించుకొని, అదే రోజు సాయంత్రం హుజూరాబాద్ చేరుకుంటుందని తెలిపారు. పూర్తి యాత్రకు అన్ని చార్జీలు కలుపుకుని పెద్దలకు రూ.4500, పిల్లలకు రూ.3800 తీసుకుంటున్నట్లు చెప్పారు. పూర్తి సమాచారం కోసం డిపో కార్యాలయం లేదా 9959225924, 9794833971, 9866117385, 9247159535 నెంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఉపా చట్టాన్ని రద్దు చేయాలి

తెలంగాణచౌక్, అక్టోబర్ 27 : చట్ట విరుద్ధ కార్యకలాపాల చట్టం(ఉపా)ను రద్దు చేయాలని ప్రొఫెసర్ సాయిబాబా కూతురు మంజీరా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని ప్రెస్ భవన్‌లో ఉమ్మడి జిల్లా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అదివారం నిర్వహించిన ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభలో ఆమె మాట్లాడారు. ఆదివాసి, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడుతున్న తమ తండ్రి సాయిబాబాను కేంద్ర ప్రభుత్వం అణవేయాలన్న కుట్రలతో ఉపా చట్టం కింద అదుపులోకి తీసుకొని చిత్రహింసలకు గురి చేసిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ కేసులతో పోరాటాలను అణచివేయలేరని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ రాజ్యాంగాన్ని గౌవరించడం లేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, పౌర హక్కుల సంఘం నాయకులు రాజయ్య, రాజగోపాల్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

హామీని అమలుచేయాలి

తెలంగాణచౌక్, అక్టోబర్ 27 : ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఉద్యమకారుల ఫోరం చైర్మన్ కనకం కుమారస్వామి డిమాండ్ చేశారు. నగరంలోని ప్రెస్ భవనంలో అదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉద్యమకారులకు 250 గజాల స్థలం, ఇంటి నిర్మాణ కోసం రూ.5 లక్షలు, నగదు రహిత హెల్త్ కార్డులను అందిచాలన్నారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కావస్తున్నా ఉద్యమకారుల గురించి ఎక్కడా ప్రస్తావన తీసురావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

బీసీ కులగణనపై బీజేపీ వైఖరి ప్రకటించాలి

తెలంగాణచౌక్, అక్టోబర్ 27 : దేశ వ్యాప్తంగా బీసీల కులగణన చేపట్టడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఖరి ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ అదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీసీల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో బీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. దేశ వ్యాప్తంగా బీసీల కులగణన చేపట్టాలనే డిమాండ్‌తో వచ్చే నెల 5, 6 తేదీల్లో ఢిల్లీలోని ఎర్రకోట ముట్టడిస్తామని హెచ్చరించారు.

పండక్కి బంగారం కొంటారా

గోల్డ్ హాల్‌మార్కింగ్ అంటే ఏమిటి? • ఎందుకిది ప్రధానం.. చార్జీలెంత!

దీపావళి పండుగ వేళ చాలామంది బంగారం కొంటూంటారు. ఇంకా చెప్పాలంటే మన దేశంలో ఇదో సంప్రదాయం.. అంతకుమించి ఓ సెంటిమెంట్. అవును.. ఈ పండక్కి పుత్తడి కొంటే లక్ష్మీ కటాక్షం దక్కినట్టేనని ఎంతోమంది నమ్మకం మరి. అయితే ఒకప్పటితో పోల్చితే ప్రస్తుతం మార్కెట్‌లో ఎన్నో రకాల మోసాలు జరుగుతున్నాయి. అమాయక కొనుగోలుదారులకు తక్కువ క్యారెట్ బంగారం అప్పజెప్పి ఎక్కువ సొమ్ము దండుకుంటున్న సంఘటనల్ని చూస్తూనే ఉన్నాం. అందుకే బంగారం నాణ్యతను తెలియజేసే ఎన్నో ప్రమాణాలను తీసుకొచ్చారు. అందులో ప్రధానమైనదే గోల్డ్ హాల్‌మార్కింగ్.

ఇదీ సంగతి..

పసిడి కొనుగోలుదారుల్లో నమ్మకాన్ని పెంచేందుకు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) పరిచయం చేసినదే ఈ గోల్డ్ హాల్‌మార్కింగ్ ప్రక్రియ. నగలు, నాణేలు, కడ్డీలు ఇతరత్రా బంగారు ఉత్పత్తుల నాణ్యతను తెలియపర్చడంలో ఇది చాలా ప్రధానం. దీని ప్రకారం ప్రతీ నగపై బీఐఎస్ మార్క్, బంగారం నాణ్యతను తెలియజేసే 22 క్యారెట్ 916 ప్రమాణం, 6 అంకెల డిజిటల్ హాల్‌మార్కింగ్ యూనిక్ ఐడీ (హెచ్‌యూఐడీ)లు ఉంటాయి. ఒక ఆభరణం మీద ఉన్న ఐడీ మరొక ఆభరణం మీద ఉండదు. సులభంగా ఆ ఐడీతో అన్ని వివరాలు తెలుస్తాయి. ఈ హాల్‌మార్కింగ్‌ను కేంద్ర ప్రభుత్వం నగల అమ్మకందారులందరికీ తప్పనిసరి చేసింది.

బీఐఎస్ హాల్‌మార్క్

ఇది మీరు కొనే బంగారం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ద్వారా నిర్వహించే లైసెన్స్‌డ్ లాబొరేటరీలో పరిశీలించబడినది అన్నదాన్ని సూచిస్తుంది. అలాగే ఇవి తాము అమ్మిన బంగారు ఆభరణాలని సూచించేలా కొందరు జ్యుయెల్లర్స్ తమ సొంత యూనిక్ ఐడెంటిఫికేషన్ మార్క్‌లనూ నగలపై వేస్తున్నారు. సాధారణంగా వారి బ్రాండ్లు, దుకాణాల పేర్లతో ఇవి ముడిపడి ఉంటున్నాయి.

చార్జీలు ఇలా..

మన దగ్గరుండే పాత బంగారు ఆభరణాలకూ హాల్‌మార్కింగ్ చేయించుకోవచ్చు. బీఐఎస్ నమోదిత జ్యుయెల్లర్స్ వద్దకు వెళ్లి వారి ద్వారా ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు. లేదా బీఐఎస్ గుర్తించిన అస్సేయింగ్ అండ్ హాల్‌మార్కింగ్ సెంటర్ల (ఏహెచ్‌సీ)కు వెళ్లి అక్కడ ఈ పనిని చేసుకోవచ్చు. మీ నగల నాణ్యతను పరిశీలించిన తర్వాతే హాల్‌మార్కింగ్ జరుగుతుంది. చార్జీలు ఒక్కో బంగారు ఆభరణానికి రూ.45గా తీసుకుంటారు. వెండి వస్తువులకూ ఉంటుంది. అందుకు రూ.35 తీసుకుంటారు. కన్‌సైన్‌మెంట్ కోసమైతే కనీస చార్జీ బంగారానికి రూ.200, వెండికి రూ.150గా ఉంటుంది. వీటికి సర్వీస్ ట్యాక్స్, ఇతర చార్జీలు అదనం. బరువుతో సంబంధం లేకుండా ఈ చార్జీలు పడుతాయి. కొత్తవి షాపుల్లో కొంటున్నప్పుడైతే తయారీ, మజూరీ (మేకింగ్, వేస్టింగ్) చార్జీల్లో ఈ హాల్‌మార్క్ చార్జీలు కలువవు. వీటిని వేరుగా చెల్లించాల్సి ఉంటుంది. ఇక గతంలో నాలుగైదు సంకేతాలతో హాల్‌మార్కింగ్ ఉండేది. అదిప్పుడు మూడుకు తగ్గింది. కాబట్టి పాత హాల్‌మార్కింగ్‌కూ విలువ ఉంటుంది. అందులో హెచ్‌యూఐడీ లేదని ఆందోళన చెందనక్కర్లేదు.



ప్యూరిటీ

బంగారం నాణ్యతను క్యారెట్లలో కొలుస్తారు. 24 క్యారెట్ (99.9%) అంటే పూర్తిగా స్వచ్ఛమైన బంగారమే. మార్కెట్‌లో ఇది బిస్కట్లు, కడ్డీలు, నాణేల రూపంలో లభిస్తుంది. 22 క్యారెట్ (22K916) అంటే అందులో 91.6 శాతం నాణ్యమైన బంగారం ఉంటుందన్న మాట. మనం కొనే ఆభరణాలు ఈ నాణ్యతతోనే ఉంటాయి. అచ్చంగా పసిడితోనే నగలు తయారుకావు. అందుకే రాగి, ఇతరత్రా లోహాలను కలపాల్సి ఉంటుంది. దానివల్ల నాణ్యత కొంత తగ్గుతుంది. ఇక 18 క్యారెట్ (18K750) అంటే ఇందులో బంగారం 75 శాతం మాత్రమే ఉంటుంది. మిగతా 25 శాతం ఇతర లోహాలుంటాయి. 14 క్యారెట్ (14K585)లో బంగారం పరిమాణం 58.5 శాతమే. క్యారెట్ ప్రామాణికత తగ్గిన కొద్దీ ధరలూ తగ్గుతూంటాయి. అందుకే అత్యధిక ధరను పెట్టి కొనే నగలపై 22K916 ఉంటుందన్నది గుర్తుంచుకోవాలి.

అమ్మకాల ఒత్తిడిలోనే..

మార్కెట్ పల్స్



దేశీయ స్టాక్ మార్కెట్లు వరుస నష్టాల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. దేశ, విదేశీ అనుకూలతల మధ్య మదుపరులు పెట్టుబడులకు దూరంగానే ఉంటున్నారు. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,822.46 పాయింట్లు లేదా 2.24 శాతం పడిపోయి 79,402.29 వద్ద ఆగింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 673.25 పాయింట్లు లేదా 2.70 శాతం పతనమై 24,180.80 దగ్గర ముగిసింది. ఈ క్రమంలో ఈ వారం కూడా అమ్మకాల ఒత్తిడికే అధిక అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికానికి (జూలై-సెప్టెంబర్)గాను కార్పొరేట్ కంపెనీలు ప్రకటించే ఆర్థిక ఫలితాలు మునుపటిలాగే మార్కెట్ ట్రేడింగ్‌ను ప్రభావితం చేయనున్నాయి. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిస్థితులు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ, ముడి చమురు ధరలు ఎప్పట్లాగే ఈసారీ భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 23,800 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 23,600 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 24,500-24,700 మధ్యకు వెళ్లవచ్చని చెప్తున్నారు.

గమనిక..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

ఈ రంగాలపై ఓ లుక్కేయండి

మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులకు అవకాశాలున్నవివే

మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టాలని మీరు యోచిస్తున్నట్లైతే.. అందుకు ఈ దీపావళియే సరైన సమయమని మెజారిటీ మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు. పైగా కొన్ని రంగాలను పరిశీలించాలని కూడా సిఫార్సు చేస్తున్నారు. వాటిలో మధ్య-చిన్న శ్రేణి ఐటీ కంపెనీలు, దేశీయ ఫార్మా సంస్థలు, పాత ప్రైవేట్ రంగ బ్యాంకులు, ఎఫ్ఎంసీజీ, టైర్ల తయారీ సంస్థల స్టాక్స్ అనుకూలంగా ఉన్నట్టు చెప్తున్నారు. అయితే ప్రస్తుతం మార్కెట్లు నష్టాల్లో నడుస్తున్నాయి. పలు దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయి. దీంతో చిన్నచిన్న మొత్తాల్లో పెట్టుబడులకు దిగాలని కూడా ఎక్స్‌పర్ట్స్ సలహా ఇస్తున్నారు. ఇందుకోసం సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల (సిప్)ను ఎంచుకోవడం ఉత్తమమని అభిప్రాయపడుతున్నారు. వీక్లీ, మంత్లీ, త్రైమాసిక పద్ధతుల్లో పెట్టుబడులకు వీలుంటుందని, వెయ్యి రూపాయలతో కూడా మదుపును మొదలు పెట్టవచ్చంటున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో సిప్‌ల్లోకి నిధుల వరద మునుపెన్నడూ లేనివిధంగా రూ.24,509 కోట్లుగా ఉండటం గమనార్హం. మొత్తానికి ఔషధ, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో పెట్టుబడులకు ఆకర్షణీయ రాబడులకు ఆస్కారం ఉందని పేర్కొంటున్నారు. అయితే మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులు స్టాక్ మార్కెట్ రిస్కులకు లోబడి ఉన్నందున నిపుణులను సంప్రదించి పెట్టుబడులకు దిగితే ఇంకా లాభించవచ్చు. అంతేగాక స్వల్పకాలిక పెట్టుబడుల కంటే దీర్ఘకాలిక పెట్టుబడులు కలిసొస్తాయన్న వాదనలూ ఉన్నాయి.



రాబడి

చిన్న బ్యాంకు.. పెద్ద వడ్డీ

స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లో ఎఫ్‌డీలు అదుర్స్

సీనియర్ సిటిజన్లకు 9.50% వడ్డీరేటు

ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ).. రిస్కుకు దూరంగా, సురక్షితమైన పెట్టుబడికి చక్కని నిర్వచనం. అయితే ఇతర పెట్టుబడి సాధనాలతో పోల్చితే మాత్రం రాబడులు తక్కువ. కానీ కొన్ని బ్యాంకుల్లో ఎఫ్‌డీలపైనా ఆకర్షణీయ వడ్డీరేట్లున్నాయి. ఏకంగా 9 శాతానికిపైగానే వడ్డీ లభిస్తుండటం గమనార్హం. అవును.. సీనియర్ సిటిజన్లకు పలు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లో గరిష్ఠంగా 9.50 శాతం వరకు వడ్డీరేటు వస్తున్నది.

- **నార్త్‌ఈస్ట్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్**
  546-1,111 రోజుల (18 నెలల ఒక్క రోజు- మూడేండ్ల 16 రోజులు) కాల వ్యవధి ఎఫ్‌డీలపై అత్యధికంగా సీనియర్ సిటిజన్లకు 9.50 శాతం వడ్డీరేటు నిస్తున్నది. రూ.5 కోట్లలోపు ఎఫ్‌డీలకే వర్తిస్తుంది. ఈ ఏడాది జూన్ 25 నుంచి ఈ రేటు అమల్లోకి వచ్చింది.
- **సూర్యోదయ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్**
  రెండేండ్ల నుంచి మూడేండ్లదాకా చేసే ఎఫ్‌డీలపై సీనియర్ సిటిజన్లకు ఇక్కడ 9.10 శాతం వడ్డీరేటు ఉంటుంది. ఈ ఏడాది సెప్టెంబర్ 4 నుంచి వర్తిస్తున్నది.
- **యూనిటీ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్**
  సీనియర్ సిటిజన్లకు 1,001 రోజుల ఎఫ్‌డీపై 9.50 శాతం వడ్డీరేటు, 701 రోజుల ఎఫ్‌డీపై 9.25 శాతం వడ్డీరేటును ఈ బ్యాంక్ ప్రకటించింది. ఈ నెల 7 నుంచే ఇవి అమల్లోకి వచ్చాయి.
- **ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్**
  1,001 రోజుల ఎఫ్‌డీపై 9.10 శాతం, 1,500 రోజుల ఎఫ్‌డీపై 9.25 శాతం వడ్డీరేట్లను సీనియర్ సిటిజన్ల కోసం ఈ బ్యాంక్ ఇస్తున్నది. ఈ ఏడాది జూన్ 7 నుంచి ఈ రేట్లు అమలవుతున్నాయి.

అదనపు సౌకర్యాలు

చాలా బ్యాంకులు సీనియర్ సిటిజన్లకు ఎఫ్‌డీలపై అదనపు వడ్డీరేట్లను అందిస్తున్నాయి. ఫిక్స్‌డ్ చేసే మొత్తాల ఆధారంగా ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో 0.50 శాతం నుంచి 0.75 శాతం మేర ఎక్కువ వడ్డీరేట్లు అమలవుతున్నాయి. అంతేగాక వృద్ధులకుండే సమస్యలు, ముఖ్యంగా ఆరోగ్య సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఎఫ్‌డీలపై రుణాలనూ బ్యాంకర్లు ఇస్తున్నారు. అయితే చేసే ఎఫ్‌డీలపై ఈ రుణ మొత్తాలు ఆధారపడి ఉంటాయి. పెద్ద ఎఫ్‌డీలపై అంతే మొత్తాల్లో రుణ సదుపాయం దొరుకుతుంది. ఈఎంఐల్లో ఈ లోన్లను తీర్చుకోవచ్చు. ఇక అత్యవసరాల దృష్ట్యా ఎఫ్‌డీల ముందస్తు ఉపసంహరణలకూ కొన్ని సంస్థలు అనుమతినిస్తున్నాయి. అ